# మృగతృష్ణ

— 'ద్వారకా'

"ఇక మీరు కూడా ఎదురింటి లక్ష్మణరావుగారిలా టైముకు అన్ని పనులూ చేసుకోవచ్చును. కాలు మీద కాలేసుకొని వేలకు వేలు జీతాలు తీసుకోవచ్చును. ఎన్ని శలవులండీ వాళ్లకు! దసరా, సంక్రాంతి, వేసవి... ఆ ఉద్యోగమే ఉద్యోగమండీ! దేనికయినా పెట్టి-పుట్టాలండీ!...." ఇరవై లక్షల మందికి నోరూరిస్తూ వెలువడ్డ ఇరవైవేల ఉపాధ్యాయుల నియామకపు పూర్తి పేజీ ప్రకటన నాతోపాటు చూస్తూ అన్నది శాంత, నా శ్రీమతి.



ఎంతో ఉత్కంఠతో వివరాల నన్నిటినీ జాగ్రత్తగా చూస్తున్న నాకు ఆమె మాటలు చిరాకు కలిగించాయి.

"అవును. నువ్వు గూడా బి.ఇడి. వెలగబెట్టావుగా! నువ్వు గూడా ఆయన భార్య ఊర్మిళమ్మలాగా నిద్రబోతూనే వేలకు వేలు సంపాదించవచ్చును." అన్నాను అసహనంగా.

"ఆ మాట మీరు చెప్పాల్నాయేంటి! ఇద్దరం అప్లయి చేద్దాం. ఇద్దరికీ వస్తే ఈ లోకంలో మనంత అదృష్టవంతులుండరు. ఒకరి కొచ్చినా ఈ తిప్పలు తప్పుతాయి" అన్నది శాంత.

"కోరుకునేందుకు ఖర్చేంకాదుగా! కోరేదేదో పెద్దగానే కోరుకుందాము. ఇద్దరికీ రావాలనే కోరుకో!" అన్నాను నవ్వుతూ.

"ఇవాళే తలస్నానం చేసి వెంకటేశ్వరస్వామికి ముడుపుకడతాను. ఉద్యోగం వస్తే ఇద్దరం స్వామికి నీలాలు సమర్పించుకుందామండీ!" అన్నది శాంత సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ.

"రానీ. తలనీలాలతో బాటు, పొర్లు దణ్ణాలు గూడా పెడదాము" అన్నాను ఆమె ముఖంలోకి చూస్తూ.

"జిల్లాల వారీగా ఏ ఏ జిల్లాలో ఎన్నెన్ని ఖాళీలున్నాయో గూడా వేశారే!" అంటూ నా ప్రక్కనే కూచున్నది శాంత.

"జిల్లాల వారిగానేగాదు ఏ ఏ పోస్టులకు ఎన్నెన్ని ఖాళీలువున్నాయో గూడా వివరంగా వేశారు." అన్నాను. మన జిల్లాకు నూటయాభై మూడు సెకండరీ పోస్టులు, లెక్కలు అరవై, సైన్సు ఎనభై, సోషలు యాభైఆరు బి.ఇడి. పోస్టులు, తెలుగు పండిట్లు డెబ్భయి ఆరు పోస్టులు...

"మన జిల్లాలో షుమారుగా టీచరు ట్రైనింగ్ అయిన వాళ్లు ఎందరుంటారండీ?" సీరియస్‌గా ముఖంపెట్టి అడిగింది శాంత.

"ఇరవైవేల మందికిపైగానే వుంటారు."

"మొత్తం నాలుగువందల ఖాళీలుగూడా లేవు! ఒక్కో పోస్టుకు యాభైమంది దాకా పోటీ పడతారు". అన్నది శాంత కొంత నిరుత్సాహంగానే! ఆశ నిరాశలు శరదంబుదాలు!

"అలాగని నిరుత్సాహపడితే ఎలా! మనమూ ప్రయత్నం చేద్దాము." అన్నాను.

"ఇందులో ఎస్.సి., ఎస్.టి., బి.సి. వగైరా రిజర్వేషన్లుపోతే మిగిలేవి ఎన్ని! వాటికోసం కట్ థ్రోట్ కాంపిటేషన్!" రుసరుసలాడుతూ లోపలికి పోయింది శాంత.

గవర్నమెంటు ఉద్యోగం లేకపోయినా పదివేలు కట్నం ఇచ్చి నన్ను పెళ్లి చేసుకున్నది శాంత. కట్నం తీసుకోటం నాకూ ఇష్టంలేదు. నాకూ వున్నాయి ఆదర్శాలు. మానాన్న నా ముందుంచిన వాస్తవాలు నా ఆదర్శాలకన్నా బలంగా రూపొందాయి గాబట్టి కట్నం పెళ్లికి అంగీకరించక తప్పలేదు.

నేను బి.ఇడి. పాసయిన సంవత్సరం నుంచీ పెళ్లి చేసుకోమని అమ్మ, నాన్న నన్ను వేధించడం మొదలు బెట్టారు. "ఇంటికి కొత్తదనం కావాలిరా! ఎన్ని సంవత్సరాలని చూచిన ముఖాలనే రోజూ చూస్తూవుంటాము? పాతరోతన్నమాట తెలీదుట్రా? బి.ఇడి. పాసయ్యావు. ఆ అమ్మాయి గూడా బి.ఇడి. పాసయిందట. ఇద్దరూ కలిసి ఇంట్లోనే పది మంది పిల్లలకు ట్యూషన్లు చెప్పుకున్నా తిండికి జరిగిపోతుంది. భయమెందుకురా?" అంటూ ఎంకరేజ్ చేశాడు నాన్న.

"ఏమీ చదువూ సంధ్యా లేని వాళ్లు పెళ్లిళ్లు చేసుకొని హాయిగా సంసారాలు చేసుకోటంలేదుట్రా? పెళ్లంటే అంత భయమెందుకురా పిచ్చి సన్నాసీ! అంత చదువు చదివావు. ఆ మాత్రం ధైర్యం లేకపోతే ఎలా?" అంటూ వంతపాడింది అమ్మ.

ఇప్పటి చదువులు ధైర్యాన్ని నేర్పటంలేదని, పిరికితనాన్ని నూరిపోస్తున్నాయని, వాళ్లకు ఎంత చెప్పినా అర్థం కాలేదు. మన చదువులకు ప్రాతిపదిక భయం. ఆశ, ఆలంబన, ఫెయిలయిపోతామేమోననే భయం, పాసయితే ప్రభుత్వోద్యోగం సంపాదించవచ్చుననే ఆశ. ఆ ఆలంబనతో చొక్కా మాయకుండా, శరీరానికి చమట పట్టకుండా, తెల్లకాయితాలను నలుపుచేస్తూ సుఖపడవచ్చును.

అమ్మ, నాన్నల ప్రోత్సాహం మాత్రమే కాక శాంత అందచందాలు, చదివిన చదువు నన్నాకర్షించాయి. ముదిరిన బెండకాయలో ఎంత రుచి వుంటుందో వయసు మీరిన పెళ్లిలో అంత ఆనందంవుంటుందని నాన్న చెప్పాడు. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరిగితేనే బాగుంటుంది అన్నది అమ్మ.

ఎల్లాగైతేనేం ఉద్యోగం రాకుండానే పెళ్లి చేసుకున్నాను. సంసారసాగరంలో అడుగుపెట్టాను.

పెళ్లి సంబరాలు ముగిసిన తరువాత "ఇచ్చట అన్ని సబ్జక్టులకును సమర్థవంతంగా ట్యూషను చెప్పబడును" అని బోర్డు రాయించి ఇంటి ముందు వేలాడదీయించాను ఉద్యోగంరాదని నిర్ణయించుకున్న తరువాత.



డాక్టర్ దగ్గరికి ఒకావిడ తన భర్తను తీసుకువచ్చింది.
"ఏమండీ మావారు రోజూ నిద్దర్లో మాట్లాడుతున్నారు" చెప్పిందావిడ.
"ఎంత కాలంగా?" అడిగాడు డాక్టర్.
"పెళ్ళయిన దగ్గర్నుంచీ..." చెప్పిందావిడ.
"దీనికి ఒకటే మందు..."
"ఏమిటో చెప్పండి" ఆదుర్దాగా ప్రశ్నించిందా ఇల్లాలు.
"ఏమీ లేదు. ప్రొద్దంతా ఆయన్ని మాట్లాడనివ్వండి!" చెప్పాడు డాక్టర్.

పి.కమల
గిద్దలూర్

ట్యూషను కావాలంటూ చాలామందే వచ్చారు. అయితే మా దగ్గర చేరేందుకు ఒక షరతు పెట్టారు. అదేమంటే 'పాసు గ్యారంటీ'. అంటే పిల్లలకు కావాల్సింది పరీక్షల్లో పాసుకావటం ఏదోవిధంగా. చదువు కాదు. సినిమా హీరో, హీరోయిన్‌తో డ్యూయెట్లు పాడుతూ, మోటారు సైకిలు మీద ఛేజింగులు చేస్తూ, హీరోయిన్ మీద ఆశలు పెట్టుకున్న ఆకతాయి వెధవల్నితంతూ పరీక్షల్లో ఫస్టు క్లాసులో పాసయినట్లు, వాళ్లు గూడా పాసు కావాలి. ఇది పిల్లల కోరిక మాత్రమే కాదు. వారి పెద్దల ఆకాంక్ష గూడా!

చదువు చెబుతామని గ్యారంటీ ఇవ్వగలం గాని పాసుచేయిస్తామనే గ్యారంటీ ఎట్లా ఇవ్వగలం! మేము ఇవ్వలేకపోయాం. డబ్బెంత కావాలన్నా ఇస్తాం. మా వాడు ఫస్టు క్లాసులో పాసుకావాలంటూ, చాలా మంది తల్లిదండ్రులు, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు బేరాలు చేశారు.

ఫీల్డుకు అసలే కొత్త. పాసు గ్యారంటీలు ఇచ్చి నెరవేర్చుకోవడం ఎలాగో తెలియదు.

అందువల్ల మా దగ్గర అన్ని క్లాసులకూ చేరి పది మందంటే పది మంది చేరారు చదువు కావాలంటూ.

నేను, శాంత ఇద్దరం చాలా శ్రద్ధగా పాఠాలు చెప్పాము. పిల్లల్ని పరీక్షలకు తయారుచేసి పంపాము. పదోతరగతి పరీక్షకు నలుగుర్ని పంపితే ఇద్దరు మొదటి తరగతిలోను, మరో ఇద్దరు రెండవ తరగతిలోను పాసయ్యారు.

తక్కువ ఫీజులు తీసుకొని, ఎక్కువగా శ్రమించి, నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాం.

మరు సంవత్సరం చాలా మంది చేరారు మాదగ్గర. ఏ గ్యారంటీలు అడగలేదు. మాకు కలిసొచ్చే రోజులొచ్చాయనుకున్నాము నేను, శాంత. "అమ్మాయి మన ఇంటికొచ్చిన వేళా విశేషం మంచిదిరా!" అంటూ తెగ సంతోషపడ్డారు అమ్మానాన్న.

"ఈ ట్యూషను పిల్లలతో ఇల్లు మరీ సంతలాగా వుంటున్నదండీ! ఒక గంటసేపయినా ప్రశాంతంగా వుండలేకపోతున్నాము. నామాట ఎట్లా వున్నా మీ అమ్మగారు చాలా ఇబ్బందిగా ఫీలవుతున్నారు" అన్నది శాంత ఆ రాత్రి నా గుండెమీద తల ఆనించి పడుకుని.

"నిజమే నాకు గూడా అట్లాగే అనిపిస్తున్నది. ప్రశాంతతలేని జీవితం ఏమి జీవితం. ఇంతకూ యేం చేద్దామంటావు?" తల నిమురుతూ అడిగాను.

"ఒక ఇల్లు బాడుక్కు తీసుకొని అందులో క్లాసులు నడుపుదామండీ. మనంగూడా టైముకు పోవటం, రావటం చేద్దాం. ఒక పనిమనిషిని పెట్టుకుందాం. అతను అక్కడే కావలిగా వుండిపోతాడు. మనతోబాటు ఒకర్నో ఇద్దర్నో టీచర్లను గూడా పెట్టుకుందాం. ఉద్యోగాల్లేకుండా బాధపడుతున్నవాళ్లు చాలా మంది వున్నారు పాపం. మనకూ కొంత విశ్రాంతి దొరుకుతుంది. కొద్దిగానయినా ఇతర్లకు సాయంచేసినట్లుంటుంది." అన్నది శాంత.

ఇంత మంచి ఆలోచన చెప్పినందుకు శాంతను యథాస్థితిలో గౌరవించాల్సిన విధంగానే గౌరవించాను.

రోడ్డు ప్రక్కనే మంచి ఇల్లు దొరికింది. పనిమనిషి గూడా కుదిరాడు. శాంత రికమండేషనుతోనే మరో ఇద్దరికి నామమాత్రపు జీతాలతో ఉద్యోగాలు గూడా ఇచ్చాము. ఆ ఇద్దరికీ టీచరుకు కావల్సిన సర్టిఫికెట్లు లేవు. "అన్‌క్వాలిఫైడ్ టీచర్లను పెట్టుకుంటే పేరెంట్స్ అభ్యంతరం చెబుతారేమో!" అన్నాను శాంతతో.

"చదువు చెప్పాలనే కోరిక, ఉత్సాహం వుండటమే గొప్ప క్వాలిఫికేషనండీ. వాళ్లు డిగ్రీలు తెచ్చుకున్న వాళ్లే. బి.ఇడి.లో సీటు సంపాదించాలంటే మరీ ఎంత కష్టమో, ఖర్చో మీకూ తెలుగా. కోరిక వున్నా స్థోమత లేనందువల్ల గ్రాడ్యుయేట్లుగానే మిగిలిపోయారు పాపం. 'మోల్ కరో తల్వార్‌కా — రహనే దో మ్యాన్' అంటూ నవ్వింది శాంత తన హిందీ పాండిత్యాన్ని వెలికితీస్తూ.

నిజంగా శాంత నాకంటే చాలా తెలివైనది. ఆమెకు ఎదురు చెప్పలేదు నేను.

ఇప్పుడు మేము నలుగురు టీచర్లం. ఒక అటెండరు. చాలా బాగా జరుగుతున్నది మా వ్యాసంగం. నేను, శాంత చెరో వెయ్యి తీసుకుంటున్నాం. ఇద్దరు టీచర్లకు చెరో ఆరొందలిస్తున్నాం. అటెండరుకు ఐదొందలు ఇస్తున్నాం. మరో ఐదొందలు ఇంటిబాడుగ. ఇతర ఖర్చులు నూరు. నూటయాభైకి మించటంలేదు.

మా ఇద్దరి సంపాదనను ప్రతినెలా శాంతి తీసుకుపోయి అమ్మ చేతిలో పెడుతున్నది. అమ్మ సంతోషానికి అవధుల్లేవు. బయటికి చూపించకపోయినా నాన్న గూడా సంతోషిస్తూనే వున్నాడు.

మేము స్కూలు ప్రారంభించిన మూడు సంవత్సరాలకల్లా మంచిస్థాయిలోకి ఎదిగాము. పరీక్షల్లో ఫలితాలు కూడా బాగా వస్తుండడంతో మా మీద పేరెంట్సుకు మంచి నమ్మకం కుదిరింది. ఇప్పుడు మా స్కూలు రెగ్యులర్ స్కూలుగానే జరుగుతున్నది. మూడు వందల మంది విద్యార్థులున్నారు. టీచర్లం పదిమందిమయ్యాం. మా ఆదాయాలు గూడా పెరిగాయి.

దాంతో మమ్మల్ని చూచి అసూయపడేవాళ్ల సంఖ్య గూడా పెరిగింది.

గవర్నమెంటు స్కూల్లో పనిచేస్తున్న టీచర్లు మొట్ట మొదటిగా అసూయపడ్డారు. తరువాత వాళ్లు, ఎడ్యుకెషన్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న అధికారులు, స్కూలు ఇన్‌స్పెక్షనుకుపోయినప్పుడు వాళ్లు టీచర్లను తెగచీవాట్లు పెడుతున్నారట. "మీరు సరిగా చదువులు చెబితే అక్కడ అంతమంది ఎందుకు చేరుతారు?" అని.

"ఇక్కడ ఇంతమంది చేరడానికిక్కారణం నాన్‌డిటెన్షన్ విధానం వల్ల క్లాసుల్లో చదువు చెప్పడానికి వీల్లేనంత ఎక్కువ తామరతంపరగా విద్యార్థులు పెరిగిపోవడమేనని ఎవరూ అనుకోరు. విద్యార్థులు పెరుగుదలతోబాటు వసతులెక్కడ పెరిగాయి? టీచర్లెక్కడ పెరిగారు?" అసలు సమస్యను తెలుసుకోకుండా వీళ్లను వాళ్లు, వాళ్లని వీళ్లు ఇద్దరూ కలిసి మమ్మల్ని తప్పులు పడుతున్నారు.

సరే. మొట్టమొదట మామీద ప్రయోగించిన బ్రహ్మాస్త్రం — రికగ్నిషనులేని స్కూల్లో చదివే చదువు చదువుగాదు. ఆ చదువుతో గవర్నమెంటు ఉద్యోగాలు రావు. పైచదువులు చదివేందుకు వీల్లేదు. అని.

ఆ అస్త్రం బ్రహ్మాండంగా పనిచేసింది. ఓపెన్ యూనివర్సిటీల చదువు గురించి చెప్పాము. సర్టిఫికేట్లు ప్రభుత్వమే ఇస్తున్నదిగాని మేముగాదని చెప్పాము. మా పిల్లలు రాస్తున్నది ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ పరీక్షలేనని నెత్తీ నోరూ కొట్టుకొని చెప్పాము. మా కంఠశోషంతా చెవిటికి శంఖం వూది వినిపించినట్లే అయింది.

ఎడ్యుకేటెడ్ పేరెంట్స్ మొదట్లో ఒకరొకరుగా, తరువాత జట్లు జట్లుగా వచ్చి "మాస్టారూ! అన్నీవుండి ఏదోతనంలేనట్లు మీ స్కూలుకు రికగ్నిషన్ లేకపోవటం యేం బాగాలేదండీ. మీరూ రికగ్నిషను సంపాదిస్తే బాగుంటుందండీ!" అంటూ సలహాలివ్వడం ప్రారంభించారు. సలహాలుగా ప్రారంభమై బెదిరింపులు దాకా పోయింది.

వారి ఒత్తిడిని తట్టుకోలేక సంబంధిత అధికార్లకు ఒక అర్జీపెట్టుకున్నాను. మేముండే ప్రదేశంలో క్రొత్తగా ఒక స్కూలు ప్రారంభించేందుకు అనుమతినివ్వమని.

అధికారులు ఇక్కడికి రావడం, మరో స్కూలు ప్రారంభించాల్సిన అవసరంవున్నదా? స్కూలు ప్రారంభిస్తామన్నవారు అందుకు కావాల్సిన వసతిని, హంగులను సమకూర్చగలరా? వగైరా విషయాలను గురించి ఆరాలు తియ్యకుండానే "మీరు ఇంత డబ్బు బ్యాంకులో జమ చెయ్యాలి, ఫలానా ఫలానా సర్టిఫికెట్లు పంపాలి. ఏ తరగతిలో ఎందరు పిల్లలున్నారు, టీచర్లెవరు, వారి విద్యార్హతలేమిటి? వగైరా వివరాలు కావాలి" అంటూ ఒక కాగితం పంపించారు.

నవ్వాలో, ఏడవాలో తెలీలేదా కాయితం చూచి. నా అప్లికేషను చూచివారు "మీరు స్కూలు ప్రారంభించవచ్చు లేదా ప్రారంభించేందుకు వీల్లేదు." అని చెబితే సరిపోతుంది. "స్కూలు ప్రారంభించవచ్చును" అంటే మిగతా హంగులు, ఆర్భాటాల గురించి ఆలోచించవచ్చును. ఆలూలేదు, చూలూలేదు, కొడుకు నామకరణ మహోత్సవానికి యేర్పాట్లు చెయ్యమన్నట్లున్నది!



ప్రతి రోజూ క్రమం తప్పకుండా గుడికి వచ్చే చంద్రాన్ని చూసి గుడి పూజారికి ముచ్చటేసింది.
"బాబూ ఈ వయసులో నీలో ఇంత భక్తి" అడిగాడు. "నేను పరమ నాస్తికుడ్నండి" చెప్పాడు చంద్రం.
"మరెందుకు గుడికి వస్తున్నట్లు?"
"నాకు రకరకాల చెప్పులు సేకరించడం హాబీలెండి!"

పొనగంటి రవీందర్
ముస్తాబాద్

అన్నీ తీసుకొని, అదనంగా మరికొంత తీసుకొని మనం ప్రభుత్వం దగ్గరకు పోవాలిగాని, ప్రభుత్వం ఎట్టి పరిస్థితులలోను మన దగ్గరికి రాదు. లింకన్ దేశంలో వున్నది 'ప్రజల కొరకు, ప్రజల వల్ల, ప్రజల యొక్క ప్రభుత్వం' ఏమోగాని మనదేశంలో ప్రజాస్వామ్యం మాత్రం 'ప్రభుత్వం కొరకు, ప్రభుత్వం వల్ల, ప్రభుత్వం యొక్క ప్రజలు' గానే వున్నది.

"అన్నీ చేస్తే డైరెక్టుగా రికగ్నిషన్ ఇస్తారేమోసార్!" అన్నారు స్కూల్లో పనిచేసే టీచర్లు. చాలా తెలివైన శాంత గూడా వాళ్లకు వంతపాడింది.

అయిష్టంగానే అయినా ఆ దిశలో నేను ప్రయత్నాలు ప్రారంభించకతప్పలేదు. మొదట కొందరి పేర్లు రాసుకొని వీరందరూ ఒక విద్యా సంస్థగా ఏర్పడ్డారు అని ధ్రువీకరిస్తూ విద్యా సంఘాన్ని రిజిస్టరు చేయించాను.

రిజిస్ట్రారు ఆఫీసులోని పని చౌకగా యేమీ జరగలేదు. "ప్రైవేటు స్కూళ్ల వాళ్లు లక్షలు సంపాయిస్తున్నారు సార్! మమ్మల్నీ కొంతలో కొంత సంతోషపెట్టాలి" అంటూ చేతులు చాచారు గుమాస్తాలు. రిజిస్ట్రేషను ఫీజు, ఖర్చులు, సంతోషపెట్టడం అన్నీ వెయ్యి దాకా అయింది.

హెల్తు, ఇంజనీరింగు డిపార్టుమెంటుల నుంచి అందులో సగం వెచ్చించి సర్టిఫికెట్లు సంపాదించాను. అన్ని సర్టిఫికెట్లు, వారు కోరిన తదితర వివరాలు అన్నీ కట్టగట్టి విద్యాశాఖాధికారిగారికి పంపించాను.

నెలరోజుల తరువాత "ఇన్‌స్పెక్షన్ ఫీజు కట్టిన చలానా లేదు కాబట్టి మీ అప్లికేషన్ను వాపసు చేస్తున్నాము" అని టైపుచేసిన కాయితం అంటించుకొని నా కట్ట నాకు తిరిగొచ్చింది. ట్రెజరీలో డబ్బు కట్టి చలాను జతచేసి అప్లికేషను కట్ట తిరిగి పంపించాను. అది అక్కడే పడివుంది.

"మాకు సహాయం చెయ్యండి" అంటూ ఎం.ఎల్.ఏ. గార్ని అడిగాను. ఆయన నన్ను, నా స్కూల్ను చాలా మెచ్చుకున్నారు. తప్పకుండా సహాయం చేస్తానని మాటిచ్చాడు. రెండు మూడు నెలలు గడిచిపోయాయి గాని నా అప్లికేషను గురించిన సమాచారం యేమీ తెలీదు. ఆఫీసుకుపోయి మాట్లాడమని చాలామంది సలహాలిచ్చారు. నన్ను ఇబ్బందిగూడా పెట్టారు. కాని సర్టిఫికెట్లు సంపాదించేందుకు పడ్డ అవస్థలు "బుద్ధి వుంటే ప్రభుత్వ కార్యాలయానికి పోవద్దు" అనే పాఠాలు చెప్పాయి.

ఏమయితే అవుతుంది లెమ్మనే నమ్మకంతో వున్నాను.

ఇంతలో వచ్చింది ఇరవైవేల టీచరు ఉద్యోగాల పూర్తి పేజీ ప్రకటన. నేను, శాంత కాకుండా ఇంకా ముగ్గురు బి.ఇడి. టీచర్లున్నారు మాస్కూల్లో మొత్తం ఐదు మందిమి.

పేపరు ప్రకటన చూచినప్పటి నుంచి మా అందరికీ ఓ రకమైన ఉన్మాదంలాంటిది పట్టింది.

జిరాక్సు చేసిన అప్లికేషను ఫారాలు కొనుక్కున్నాము. మా సర్టిఫికెట్లన్నిటికీ జిరాక్సు కాపీలు తీయించాము. పోస్టులో పంపితే ఎటయినాపోతాయ్యేమోననే భయంతో స్వయంగా తీసుకుపోయి ఆఫీసులో ఇచ్చాము.

మా ముగ్గురు బి.ఇడి. టీచర్లు స్కూల్లో ముళ్లమీద వున్నట్లున్నారు. స్కూలుకు సరిగా రావడంలేదు. వచ్చినా సరిగా పాఠాలు చెప్పడంలేదు.

"ఏమండీ! ఏమిటీ విషయం?" అంటూ అడిగాను వాళ్లను. "బి.ఇడి. పాసయి చాలా సంవత్సరాలయింది గదండీ, టెస్టుకు ప్రిపేరు కావాలి. మార్కెట్‌లోకి గైడ్లు వచ్చినాయ్. ప్రక్క టౌన్లో కోచింగ్ క్లాసులు కూడా నడుపుతున్నారట. స్కూల్లో పనిచేస్తున్న విధానం మాకు గూడా నచ్చటంలేదు సార్!... మీరేమీ అనుకోనంటే... మాకు రిక్రూట్‌మెంట్ టెస్టు అయిపోయిందాకా లీవు ఇవ్వమని అడుగుదామనుకుంటున్నాం సార్"! అన్నారు ముగ్గురూ ముక్తకంఠంతో.

బంగారం గ్రుడ్లు నెలనెలా పెట్టే ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించకుండా, ఏ భద్రాతాలేని నా స్కూల్లో పనిచేస్తూ వుండమని ఎట్లా చెప్పగలన్నేను?

"అలాగే కానివ్వండి. ఈ రోజు నుంచే మీరు స్కూలుకు రానవసరంలేదు". అన్నాను వాళ్లతో.

"మీరు గూడా ప్రిపేరు కావాలిగదండీ? మేడం గారు గూడా రాస్తున్నారు గదా?" అన్నారు వాళ్లు.

"నిజమే. మీరు ముగ్గురూ ఉండరు. మేమిద్దరమూ కూడా లేకపోతే స్కూలెలా జరుగుతుంది? అదే ఆలోచిస్తున్నాను" అన్నాను.

"ఒక నెలరోజులు స్కూలుకు శలవులిచ్చేద్దాం సార్! దసరా శలవులు, సంక్రాంతి శలవులు ఉపయోగించుకోకుండా కాంపెన్సేట్ చేద్దాము" అన్నాడు ముగ్గురిలో ఒకతను. పద్మనాభయ్య.

"మీరు చెప్పేది బాగానే వుంది గాని పేరెంట్స్ వూరు కుంటారా? అసలు దసరా, సంక్రాంతి వగైరా శలవులన్నీ ఇచ్చేది పిల్లలకోసంగాని మనకోసంగాదు. వాళ్లు వుండరు గాబట్టే మనకు శలవులు! అంతే".

"పిల్లలకు, పేరెంట్స్‌కు ఎలాగో సర్దిచెబుదాం సార్!" అన్నాడు అతనే. "వాళ్లు మాత్రం మనమేలు కోరే వాళ్లు కారాసార్!"

మిగతా 31వ పేజీలో

27వ పేజీ తరువాయి...

"సరే. శలవుల మాట మళ్లీ ఆలోచిస్తాను. మీరు రావద్దులెండి రేపటి నుంచి". అన్నాను.

అదృష్టం బాగుండి ప్రభుత్వ ఉద్యోగంవస్తే సరేసరి. ఒకవేళ రాకపోతే మళ్లీ ఇక్కడికే రావాలి. స్కూలు పని చేస్తే కొత్తవాళ్ల నెవర్నయినా నియమించుకోవచ్చును. అప్పుడు వున్న పనిగూడా వూడుతుంది. ఉద్యోగం ఖచ్చితంగా వస్తుందని నమ్మకం లేదు ఎవరికీ. రాకుండా వుండే అవకాశాలే ఎక్కువ. అయినా పరీక్షకు నిలబడకుండానే ఫలితాన్ని మనమే చెప్పేసుకుంటే ఎలా? ఇదివాళ్ల మానసిక పరిస్థితి.

వాళ్ల చోట్లలో కొత్తవారిని నియమించనని హామీ ఇచ్చాను వారికి. ఆ రోజే వెళ్లిపోయారు వాళ్లు — రేపటి దాకా ఆగకుండా.

శాంత, నేను స్కూలు నిర్వహణను గురించి దీర్ఘంగా ఆలోచించాము. చివరకు శలవులు ప్రకటించడమే మంచిదనే నిర్ణయానికొచ్చాము.

పేరెంట్సు చాలామంది మామీదికి తగాదాకొచ్చారు. వారికి సర్దిచెప్పి పంపించేసరికి తలలో ప్రాణం తోకలో కొచ్చింది.

మేము అప్లికేషన్లు ఇచ్చి వచ్చింతరువాత డి.ఇ.ఓ.గారు తెలుగులో ఇచ్చిన ఫారాలు చెల్లవు. వాటిని ఇంగ్లీషులోనే తయారుచేసి యివ్వాలి అంటూ పత్రికా ప్రకటన చేశారు — తెలుగు అప్లికేషను ఫారాలు త్రిప్పి పంపకుండానే అవసరం మాది. ఆయనకేం ఉద్యోగంలో వున్న మహరాజుగదా! అధికార భాషా సంఘంవారు కిమ్మనకుండా కూచున్నారు. 'అంతటి వాడట్లాయెను. మనమనగానెంతవారము' అనుకుంటూ తిరిగి ఇంగ్లీషు అప్లికేషను ఫారాలు కొనుక్కొని, జిరాక్సు కాపీలు తీయించి, స్వయంగా తీసుకుపోయి అర్పించుకొని వచ్చాము.

అప్లికేషన్లు తయారుచెయ్యడం, ఇవ్వడం వగైరాలకు నా వరకు నాకు ఐదు వందల దాకా అయింది. అప్లికేషన్లు పంపిన అందరికీ ఉద్యోగాలు రావనేది నిజం. ఉద్యోగాల పేరు మీద జిరాక్సుల వాళ్లకు, గైడ్లు రాసిన వాళ్లకు, కోచింగ్ క్లాసులు నిర్వహించిన వాళ్లకు, ఫీజుల రూపంలో ప్రభుత్వానికి మంచి ఆదాయం వచ్చి వుంటుందనేది గూడా నిజమే. వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోగల అత్యంత సమర్థులున్న సమాజం మనది. అందులో న్యాయాన్యాయాలకు, ధర్మాధర్మాలకు, యుక్తాయుక్తాలకు తావులేదు.

"సెకండరీ గ్రేడు పోస్టులు మా జిల్లాలో ఎక్కువగా వున్నాయి. నేటివిటీ సర్టిఫికెట్టుగూడా వుంది. నేను మా జిల్లాలో రాస్తానండీ"! అన్నది శాంత.

"మీ జిల్లాలో నీకు ఉద్యోగం వస్తే ఇక్కడ నేనేం కావాలి? మా జిల్లాలో నేను, మీ జిల్లాలో నువ్వు విడివిడిగా ఉద్యోగాలు చేస్తు ఎలా బ్రతగ్గలం శాంతా?". అన్నాను దీనంగా ముఖంపెట్టి.

"ఉద్యోగమనే దొకటి వస్తే జిల్లాలు వేరయినా మనం ఒకటిగానే వుండొచ్చులెండి! భార్యాభర్తలను విడదియ్యడం పాపంగాబట్టి వాళ్లు ఒక చోట్లోనే వుండేలా చూడాలి అంటూ జి.వో. గూడా వుంది. దాన్ని పట్టుకొని ఎలాగో మనం ఒకటి కావచ్చును. కాకపోతే ప్రభుత్వోద్యోగులకు సవాలక్ష శలవులున్నాయి. ఏదో పేరుతో శలవు మీరు, నేనూ, మార్చిమార్చి పెట్టుకుంటూ ఒకటిగానే వుండొచ్చును." గలగలా అన్నది శాంత.

శాంత నాకంటె ఎక్కువ తెలివిగలదని ముందే చెప్పాను. ఆమె మాటకు ఎదురు చెప్పలేదు.

"ఈ పరీక్షలు జరిగిందాకా నమ్మకం లేదు సార్!" అంటూ వచ్చాడు పద్మనాభయ్య ఒక రోజు.

నా గుండెలో బండపడినట్లయింది.

"ఏం? ఎందుకని?" అన్నాను తేరుకొని. "పత్రికల్లో ప్రకటనలొచ్చాయి. తెలుగుకాదంటే ఇంగ్లీషులో అప్లికేషన్లు పంపాము. ఇంత జరిగింతరువాత గూడా పరీక్షలు జరగకపోవడమేంటి! నేన్నమ్మను." అన్నాను.

"ఎయిటీనైన్‌లో సెలెక్టు చేసుకున్నవాళ్లందరికీ ఉద్యోగాలివ్వలేదటసార్! వాళ్లందరూ కోర్టుకెళ్ళారు. కోర్టు స్టేయిస్తే ఇక పరీక్షలెలా జరుగుతాయి?" అంటూ చావుకబురు చల్లగా నా చెవిలో వేసి పోయాడతను.

పిల్లకి చలగాటం ఎలక్కు ప్రాణ సంకటం! ఈ ఏడుపుకు ఇంత తతంగం ఎందుకు? అని ప్రభుత్వాన్ని కసిదీరా తిట్టుకున్నాను.

ఆ తరువాత మరో మూడు రోజులకు కోర్టు ఉత్తర్వురానే వచ్చింది — పరీక్షలు జరపవచ్చును. కాని ఫలితాలు ప్రకటించగూడదు — అని.

ఈ వెధవ పరీక్షలు రాయగూడదు అనుకున్నాను. సెకండరీ పోస్టుకు, బి.ఇడి. పోస్టుకు రెండింటికీ అప్లికేషను వేశాను. వేరు వేరు తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. మొదట సెకండరీగ్రేడుకు, తరువాత వారానికి బి.ఇడి. టీచర్లకు.

శాంత పుట్టింకికి పోయింది. సెకండరీ గ్రేడు పరీక్ష అక్కడ రాస్తుంది. బి.ఇడి. ఈ జిల్లాలో రాస్తుంది.

ఇంతదూరం వచ్చింతరువాత పరీక్ష రాయకపోతే ఎలా? ఇందుకోసం దాదాపు వెయ్యి రూపాయలు చార్జయ్యాయి. ఆ వెయ్యి ఇచ్చిన పిల్లలకు శలవులు ప్రకటించాము. ఇష్టమున్నా లేకున్నా పరీక్ష రాసేందుకే నిర్ణయించుకున్నాను.

సెకండరీ గ్రేడు పరీక్ష జిల్లా కేంద్రంలో రాసివచ్చాను. బాగా రాశానో లేదో నాకే తెలీదు. రాయాలిగాబట్టి రాశాను.

పరీక్షలయిన మర్నాడే పుట్టింటి నుంచి వచ్చేసింది శాంత. "నేను చాలా బాగా రాశానండీ. అన్నీ తెలిసిన ప్రశ్నలే. నైన్‌టీ పర్సెంట్ గ్యారంటీగా వస్తాయి మార్కులు... మా అన్నయ్య ఎం.ఎల్.ఏ. గారితో గూడా మాట్లాడతానన్నాడు." మహా హుషారుగా మాట్లాడింది శాంత. "మీరెట్లారాశారు?" అని నన్నడిగింది.

"ఎట్లా రాశానో రిజల్టు వచ్చిందాకా చెప్పలేను." అన్నాను ఆమెను తదేకంగా చూస్తూ.

శాంతకు ఉద్యోగం వచ్చేసినట్లు, అమె నాకు దూరంగా పోతున్నట్లు అనిపించింది.

ఆ మర్నాడు పత్రికలో వార్త మహిళలకు ప్రభుత్వోద్యోగాల్లో యాభైశాతం రిజర్వేషను చేస్తున్నట్లు ముఖ్యమంత్రిగారు ప్రకటించారని.

"ఈ ఫిఫ్టీ పర్సెంటులో ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ, వగైరా మహిళలకు గూడా రిజర్వేషను వుంటుందిటండీ?" అంటూ వచ్చింది శాంత.

నాకు మహాచెడ్డ కోపం వచ్చింది. పిచ్చికుక్కలా అరచి ఆమెను తరిమేశాను. అలాచేసినందుకు తరువాత చాలా బాధపడ్డాను. ఆమెను ఓదార్చాను గూడా.

ఇద్దరంపోయి బి.ఇడి. పోస్టులకు నిర్వహించిన పరీక్షలు రాసివచ్చాము. మా సబ్జక్టులు వేరు వేరు. అయినా పరీక్షల గురించి ఏమీ మాట్లాడుకోలేదు.

ఇంటికి తిరిగొచ్చింతరువాత ఇద్దరం ఈ పరీక్షల గొడవలోనించి బయటపడ్డందుకు సంతోషంగా తలంటుకొని నీళ్లు పోసుకున్నాము.

రిజల్టు కోసం ఎదురుచూడకుండా స్కూలు ప్రారంభిద్దామనుకున్నాము. మాతోపాటు పరుగులు తియ్యడానికి అవకాశంలేని అదృష్టవంతులు — టీచర్లు కొందరు స్కూలు కొచ్చారు. ఆ ముగ్గురు బి.ఇడి.లు రాలేదు. పాపం ఇంకా కోలుకున్నారో లేదో శ్రమ నుంచి.

స్కూలుకు ఐదారు మందికి మించి పిల్లలు రాలేదు. కారణం వాళ్లే చెప్పారు.

ప్రభుత్వ హైస్కూల్లో పనిచేస్తున్న టీచర్లు కొందరు ఒకటిగా చేరి వాళ్లే ప్రైవేటు స్కూలు ఒకదాన్ని ప్రారంభించారట. మాకు ఏటుదిరిగీ ఉద్యోగాలొచ్చి వెళ్లిపోతాము గాబట్టి మా స్కూలు తిరిగి తెరవటం వుండదని వాళ్లు ప్రచారంచేశారట. పేరెంట్సు మనసారా మమ్మల్ని తిట్టుకుంటూ మళ్లీ ఫీజులు కట్టి కొత్త స్కూల్లో పిల్లల్ని చేర్పించారట. హైస్కూలు మాస్టర్లు మా పిల్లల భవిష్యత్తును కాపాడారంటూ తెగమెచ్చుకున్నారట.

★ ★ ★

మేము పరీక్షల్లో పాసుకాలేదని — మాకు ఉద్యోగాలు రాలేదని చెప్పనవసరంలేదనుకుంటాను.

అద్దెకు తీసుకున్న ఇల్లు ఖాళీ చేశాము.

మమ్మల్ని నమ్ముకున్న టీచర్లను ఇండ్లకు పంపేశాము.

మాతో పరీక్షలు రాసిన ముగ్గురు బి.ఇడి. టీచర్లు కొత్త స్కూల్లో చేరిపోయారు. క్రమంగా మిగిలినవాళ్ళూ చేరిపోతారు.

శాంతను, నన్ను కొత్త స్కూల్లో టీచర్లుగా చేరమంటూ ఆహ్వానాలు పంపించారు.

పూలుపెట్టుకున్న చోట్లోనే కట్టెలు నెత్తినపెట్టుకొని ఎలా అమ్ముతాం. మేం పోలేదు.

శాంత, నేను మా ఐదారుగురు పిల్లలకు తిరిగి ట్యూషను చెప్పడం ఆరంభించాము.

"మనకు తిరిగి మంచిరోజులు రాకపోవులెండి"! అని నన్ను ఓదారుస్తుంటుంది శాంత.

ఎండమావులను నీటి చలమలుగా భ్రమించడం బుద్ధి తక్కువ. ఇరవైవేల టీచరు ఉద్యోగాల పేరు మీద చాలా మంది బాగుపడ్డారు. అంతకు మించిన చాలా మంది చెడిపోయారు. ●




ప్రముఖ కార్టూనిస్ట్ విదేశాలలో పర్యటిస్తున్నాడు. ఒకచోట పత్రికా విలేఖరొకరు కలిసి "ఏమండి మీ కార్టూన్లలో ప్రముఖమైందాన్ని నేను చూడాలనుకుంటున్నాను" అన్నాడు.

కార్టూనిస్ట్ నిశ్శబ్దంగా పక్కరూంలోకి వెళ్లి వచ్చి "ఇదండి!" అంటూ పక్కనున్న తన అబ్బాయిని చూపించాడు.

-కె.అన్నపూర్ణ
హైదరాబాద్